# సాక్షి
## భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం : 30 : జూలై : 2025






**డబ్బులు ఊరికే పోగొట్టుకోవద్దు..**
అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లు ఓపెన్ చేసి డబ్బులు పోగొట్టుకోవద్దని పోలీసులు సూచిస్తున్నారు. 8లో



**'నానో'పై అవగాహన**
పంటల సాగులో అధికంగా యూరియా వేయకుండా నానో యూరియా వినియోగించాలని డీఏఓ బాబూరావు అన్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 24°

**వాతావరణం**
జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

**భద్రాచలం:** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

**రామాలయంలో ఐఎస్‌ఓ ప్రతినిధుల పరిశీలన**

**భద్రాచలంటౌన్:** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానాన్ని ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి బృందం మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు దేవస్థాన రికార్డులతో పాటు పలు విభాగాల్లో సిబ్బంది పనితీరు, ప్రసాదం, ఆలయ పరిసరాల్లో విక్రయిస్తున్న వస్తువుల నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ముందుగా వారు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బృందం హెడ్ శివయ్య, ఆలయ ఈఓ రమాదేవి పాల్గొన్నారు.

### ఫారెస్ట్ రీసెర్చ్ సెంటర్లను అభివృద్ధి చేస్తాం



సిబ్బందితో మాట్లాడుతున్న కిషన్, పక్కన కృష్ణాగౌడ్

**అశ్వారావుపేటరూరల్:** ఫారెస్ట్ రీసెర్చ్ సెంటర్లను మరింతగా అభివృద్ధి చేస్తామని, ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రీసెర్చ్, డెవలప్‌మెంట్ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ కిషన్ అన్నారు. మండలంలోని అచ్యుతాపురం క్రాస్ రోడ్ వద్ద గల అటవీ పరిశోధన కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. రీసెర్చ్ సెంటర్‌లో రికార్డులు, సౌకర్యాలతో పాటు దమ్మపేట మండలం అల్లిగూడెం వద్ద గల ప్లాంటేషన్లను పరిశీలించారు. పరిశోధనలపై దృష్టి పెట్టడంతో పాటు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. రీసెర్చ్ సెంటర్ భవనం శిథిలావస్థకు చేరినందున నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. అనంతరం డీఎఫ్ఓ కృష్ణాగౌడ్‌తో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో రీసెర్చ్ సెంటర్ ఇన్‌చార్జ్ రేంజర్ జరీనా, అశ్వారావుపేట, దమ్మపేట రేంజర్లు మురళీకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

### ఆలయ ఈఓకు ఉద్యోగోన్నతి

**భద్రాచలంటౌన్:** శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ ఈఓ ఎల్.రమాదేవికి స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2023 ఫిబ్రవరిలో డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెకు ఆలయ ఇన్‌చార్జి ఈఓగా, ఆ తర్వాత పూర్తిస్థాయి ఈఓగా బాధ్యతలు అప్పగించారు. రెవెన్యూ శాఖలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందిన ఆమెకు ఆలయ ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. కాగా, రమాదేవిని ఆలయ ఈఓగా కొనసాగిస్తారా, బదిలీ చేస్తారా అనేది తెలియాల్సి ఉంది.


### సమయపాలన పాటించాలి
**డీఐఈఓ వెంకటేశ్వరరావు**

**ములకలపల్లి :** విద్యార్థులు, అధ్యాపకులు సమయపాలన పాటించాలని డీఐఈఓ హెచ్.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని లెక్చరర్లను ఆదేశించారు. ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఫిజిక్స్ వాలా ఆన్‌లైన్ తరగతులను శ్రద్ధగా వినాలని విద్యార్థులకు సూచించారు. ఇంటర్ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాశాల రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కల్పన, లెక్చరర్లు పాల్గొన్నారు.

### కేజీబీవీల్లో స్పాట్ అడ్మిషన్లు

**కొత్తగూడెంఅర్బన్:** జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని డీఈఓ ఎం.వెంకటేశ్వరచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# గనుల్లో వనాలు..



మొక్కలు నాటడంతో అడవులను తలపిస్తున్న మూతబడిన ఓపెన్‌కాస్ట్ గని ప్రదేశాలు



**సామాజిక బాధ్యతగా మొక్కలు నాటుతున్న సింగరేణి**

- ఆరు జిల్లాల పరిధిలో 15వేల హెక్టార్లలో పెరిగిన చెట్లు
- అడవులను తలపిస్తున్న మూతబడిన గనులు
- సింగరేణి వనాల్లో సత్ఫలితాలిస్తున్న తేనెటీగల పెంపకం
- స్వయంగా 20 వేల మొక్కలు నాటిన సీఎండీ బలరామ్

**సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం:** సాధారణంగా దట్టమైన అడవులు ఉన్న ప్రాంతాల్లోనే బొగ్గు నిక్షేపాలు ఉంటాయి. దీంతో ఈ బొగ్గును వెలికి తీసేందుకు వందల హెక్టార్ల అడవుల్లో మైనింగ్ చేయక తప్పదు. ఫలితంగా ప్రతీ ఏటా అడవులను నష్టపోతుండగా దీన్ని భర్తీ చేసేందుకు గనులు మూసివేసిన ప్రాంతంలో భారీ ఎత్తున మొక్కలు నాటాలని, ఇది మైనింగ్ సంస్థల సామాజిక బాధ్యత అని కేంద్ర ప్రభుత్వం నిబంధనలు విధించింది. 1984 నుంచి ఈ నిబంధనలు అమల్లో ఉన్నాయి. అయితే ఆరంభంలో మొక్కలు నాటే కార్యక్రమం అరకొరగానే జరిగినా.. గత ఐదారేళ్లుగా చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారు. మూసి వేసిన భూగర్భ గనులు, ఓపెన్ కాస్ట్‌లు, పని ప్రదేశాలు, లీజు స్థలాలు, కార్మిక వాడలు.. ఇలా వేర్వేరు ప్రాంతాల్లో మియావాకీ, సీడ్‌బాల్స్, అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా భారీగా మొక్కలు నాటుతున్నారు. ఈ క్రమంలో హరితహారం, వనమహోత్సవం, వృక్షరూపం అభియాన్ తదితర కార్యక్రమాల ద్వారా ఇప్పటి వరకు సింగరేణి సంస్థ స్వయంగా నాటినవి, పంపిణీ చేసినవి కలిపితే 5.47 కోట్ల మొక్కలుగా సంస్థ రికార్డులు తెలుపుతున్నాయి.

**అడవులుగా మారుస్తున్నారు..**

సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల కారణంగా తవ్వి తీసే ఓవర్ బర్డెన్ ఒకప్పుడు ఎత్తయిన మట్టి గుట్టలుగా కనిపించేది. కానీ గత కొన్నేళ్లుగా సింగరేణి సంస్థ నిర్విరామంగా నాటుతున్న మొక్కలతో ఈ మట్టిగుట్టలు పచ్చ రంగు సంతరించుకున్నాయి. నాటిన మొక్కలు ఏపుగా ఎదిగేందుకు ట్రీ గార్డ్ల ఏర్పాటుతోనే సరిపెట్టకుండా వేసవిలో ఎండు ఆకుల కారణంగా అగ్ని ప్రమాదాలు జరిగి మొక్కలు చనిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అంతేకాదు.. గని ప్రదేశాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఏడాది పొడవునా నీటి వనరులు ఉండేలా చర్యలు చేపడుతున్నారు. అవసరమైన చోట డ్రిప్ పద్ధతిలో మొక్కలకు నీరందిస్తున్నారు. దీంతో సంస్థ పరిధిలోని ప్రతీ ఏరియాలో మూతబడిన గనులు ఇప్పుడు మినీ అడవులను తలపిస్తున్నాయి. ఇప్పటి వరకు 15,231 హెక్టార్లలో మొక్కలు నాటినట్టు సంస్థ వెల్లడించింది.

**తేనెటీగల పెంపకం..**

జీవవైవిధ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే క్రమంలో పైలట్ ప్రాజెక్టుగా కొత్తగూడెం గౌతమ్ ఖని ఓపెన్ కాస్ట్ వద్ద 20 హెక్టార్లలో రూ.4.76 కోట్ల వ్యయంతో ఎకో బయోడైవర్సిటీ పార్క్‌ను సంస్థ సిద్ధం చేసింది. ఇక్కడ చేపట్టిన తేనెటీగల పెంపకం కార్యక్రమం విజయవంతం కావడం పర్యావరణ పరిరక్షణకు సంస్థ తీసుకుంటున్న చర్యలకు మచ్చుతునకగా నిలుస్తోంది. రాబోయే రోజుల్లో ఇతర ఏరియాల్లోనూ ఎకో పార్కులు అభివృద్ధి చేయనున్నారు.

**ట్రీమ్యాన్‌గా సీఎండీ..**

నిబంధనలు ఎలా ఉన్నప్పటికీ అమలు చేసే వారిలో చిత్తశుద్ధి లేకుంటే సానుకూల ఫలితాలు సాధించడం కష్టం. ప్రస్తుత సింగరేణి సీఎండీ బలరామ్‌నాయక్‌కు స్వతహాగా వనాలంటే ఇష్టం. దీంతో గత ఆరేళ్లుగా సింగరేణిలో మొక్కలు నాటే కార్యక్రమం అప్రతిహతంగా కొనసాగుతోంది. ఆయన డైరెక్టర్ (పా)గా ఉన్నప్పుడు 2019 జూన్ 5న ఒకే రోజు 108 మొక్కలు నాటారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అవకాశం వచ్చిన ప్రతీసారి భారీగా మొక్కలను నాటుతూనే ఉన్నారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం కొత్తగూడెం ఏరియాలో 225 మొక్కలు నాటగా.. బలరామ్ ఒక్కరే 20 వేల మొక్కలు నాటిన ఘనత సాధించారు. దేశం మొత్తంలో సివిల్ సర్వీసెస్‌లో ఉన్న వారిలో స్వయంగా 20 వేల మొక్కలు నాటిన ఏకైక అధికారిగా బలరామ్‌నాయక్ నిలిచారు.

**సీఎండీ నాటిన మొక్కల వివరాలిలా..**

| ఏడాది | నాటిన మొక్కలు |
|---|---|
| 2019 | 6,376 |
| 2020 | 3,686 |
| 2121 | 2,901 |
| 2022 | 2,580 |
| 2023 | 2,508 |
| 2024 | 891 |
| 2025 (జూలై 29 వరకు) | 1,063 |
| మొత్తం | 20,005 |

**ఒక మొక్క.. పది మంది కుమారులతో సమానం**



డంప్ యార్డ్‌పై నాటిన మొక్క వద్ద సింగరేణి సీఎండీ బలరామ్

**సింగరేణి(కొత్తగూడెం):** నాటే ప్రతీ మొక్క పది మంది కుమారులతో సమానమవని.. కుమారుల మాదిరిగానే మొక్కలు అండగా నిలుస్తాయని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌నాయక్ తెలిపారు. తన పుట్టిన రోజు సందర్భంగా కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీకేఓసీ డంప్ యార్డ్‌పై మంగళవారం ఆయన ఒక్కరే 225 మొక్కలు నాటారు. దేశంలో ఇప్పటివరకు ఆరేళ్లలో 20వేల మొక్కలు నాటిన సివిల్ సర్వీసెస్ అధికారిగా రికార్డు నమోదు కావడంతో విశ్వగురువు వరల్డ్ రికార్డ్‌లో చోటు కల్పిస్తూ సంస్థ ప్రతినిధి సత్యవోలు రాంబాబు సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ సింగరేణి సంస్థ మొక్కలు నాటడంలో ముందు వరుసలో నిలుస్తోందని అన్నారు. అనంతరం డైరెక్టర్లు గౌతం పొట్రు, సత్యనారాయణరావు, వెంకటేశ్వర్లు, సూర్యనారాయణరావు, జీఎంలు శాలేం రాజు, సుభానీ అధికారులు, యూనియన్ల నాయకులు సీఎండీని సన్మానించగా గత ఆరేళ్లలో సింగరేణి ఏరియాల్లో నాటిన మొక్కల వివరాలతో రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

# స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న రాంచందర్‌రావు, పక్కన రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు

- బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌ది నాటకమే
- తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**చుంచుపల్లి:** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ శ్రేణులు సత్తా చాటి అత్యధిక స్థానాలు కైవసం చేసుకోవాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన కొత్తగూడెం పర్యటనకు రాగా, బైపాస్ రోడ్డు వద్ద కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతూ.. దేశాన్ని 55 ఏళ్లకు పైగా పాలించిన కాంగ్రెస్.. కనీసం ఎస్టీ కమిషన్ కూడా వేయలేకపోయిందని, అటల్ బిహారీ వాజ్‌పేయ్ వచ్చాక ప్రత్యేక ఎస్టీ కమిషన్‌తో పాటు మినిస్ట్రీని సైతం ఏర్పాటు చేశారని చెప్పారు. తొలిసారి ఓబీసీ కమిషన్ ఏర్పాటు చేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకి దక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓట్లు, డబ్బు కోసం రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12వేల చొప్పున, నిరుద్యోగులకు ప్రతినెలా జీవనోభృతి ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ వాటిని పూర్తిగా విస్మరించిందని అన్నారు. పేదలకు ఉచిత బియ్యం కేంద్రమే ఇస్తున్నందున రేషన్ కార్డులపై మోదీ ఫొటో పెట్టాలని డిమాండ్ చేశారు. 18 నెలలుగా రిటైర్డ్ ఉద్యోగులకు, దివ్యాంగులకు కనీస బెనిఫిట్లతో పాటు పింఛన్ ఇవ్వలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. కేంద్రంలో బీజేపీ వచ్చిన తర్వాత 11 ఏళ్లుగా నిరాటంకంగా దేశం అభివృద్ధి జరుగుతోందని అన్నారు. కొత్తగూడెంలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించలేదని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం రాకముందు దేశంలో 75 విమానాశ్రయాలు మాత్రమే ఉండేవని, గత 11 ఏళ్లలో ఆ సంఖ్య 150కి పెరిగిందని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా ఒరిగిందేమీ లేదని, ఒక మంత్రి యూరియా విషయంలో రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం నాటకం ఆడుతోందని, దీన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు పూర్తిగా వారికే చెందాలని, 10 శాతం ముస్లింలకు ఇస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీ సీతారాం నాయక్, నాయకులు తాండ్ర వినోద్ రావు, కుంజా ధర్మ, రంగాకిరణ్, జీవీకే మనోహర్‌రావు, బాలరాజు, విమల్ కుమార్ జైన్, కొదమసింహం పాండురంగచార్యులు, సీతారామరాజు, జెల్లారపు శ్రీనివాసరావు, విద్యాసాగర్, గొడుగు శ్రీధర్, నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర బృందం సందర్శన

**చండ్రుగొండ :** మండలంలోని గుర్రాయిగూడెంలో కేంద్ర స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ సర్వే బృందం మంగళవారం పర్యటించింది. గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఇంకుడుగుంతలు, మరుగుదొడ్లు, కిచెన్ గార్డెన్‌ల పెంపకం, తడి పొడి చెత్త వేరు చేయడం వంటి అంశాలపై ఆరా తీశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, ఉపాధ్యాయుల పనితీరును సర్వే యాప్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో జిల్లా స్వచ్ఛ భారత్ కో ఆర్డినేటర్ ఎం.రేవతి, ఎంపీడీఓ బయ్యారపు అశోక్, ఎంపీఓ ఖాన్ పాల్గొన్నారు.

**పీహెచ్‌సీని పరిశీలించిన రాష్ట్ర బృందం**

**టేకులపల్లి:** స్వచ్ఛ సర్వేక్షన్ సర్వే – 2025లో భాగంగా మండలంలోని గొల్లపల్లి పీహెచ్‌సీని రాష్ట్ర బృందం సభ్యులు మంగళవారం పరిశీలించారు. పీహెచ్‌సీ చుట్టూ పరిశుభ్రత, మెడికల్ వ్యర్థాలను సక్రమంగా క్రిమిరహితం చేస్తున్నారా అనే విషయాలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆ తర్వాత ఇళ్లు, అంగన్‌వాడీ సెంటర్, ప్రభుత్వ పాఠశాల, గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. ఇంకుడు గుంతలు, తడి, పొడి చెత్తను వేరు చేసే విధానంపై సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మిషన్ ప్రత్యేకాధికారి రవిచంద్ర, ఎంపీడీఓ మల్లీశ్వరి, ఏపీఓ గణేష్ గాంధీ, కార్యదర్శులు చిట్టెమ్మ, శ్వేత, పవిత్ర వైద్య సిబ్బంది హారిక, కమల, సుజాత పాల్గొన్నారు.



టేకులపల్లి: పీహెచ్‌సీని పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం సభ్యులు

# తేనెటీగల పెంపకంతో లాభాలెన్నో..

**కలెక్టర్ జితేష్ వి పాటిల్, సీఎండీ బలరామ్**

**సింగరేణి(కొత్తగూడెం):** తేనెటీగల పెంపకంతో లాభాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్, సింగరేణి సీఎండీ బలరామ్ నాయక్ అన్నారు. కొత్తగూడెం ఏరియాలో తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇచ్చిన 100 మంది మహిళలకు మంగళవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తేనెటీగల పెంపకంపై మహిళలకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమని అన్నారు. తేనెటీగలతో పాటు మునగ, వేప, కూరగాయల వంటివి కూడా సాగు చేయాలని సూచించారు. సీఎండీ బలరామ్ మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ సామాజిక బాధ్యతగా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని, అవసరమైన వారికి శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. కంపెనీ అందించిన తేనె తొట్టెల కిట్లతో పెద్ద ఎత్తున తేనె ఉత్పత్తి చేయాలని, మార్కెట్‌లో తేనెకు గల డిమాండ్‌తో లాభాలు సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డైరెక్టర్(పా)గౌతమ్ పొట్రు, డైరెక్టర్లు సత్యనారాయణరావు, ఎల్.వి. సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, కొత్తగూడెం ఏరియా జీఎం ఎం. శాలేంరాజు, రమణమూర్తి, పీతాంబరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి. పాటిల్, పక్కన సీఎండీ, ఇతర అధికారులు

**చేతి వృత్తులకు భవిష్యత్‌లో విలువ**

**సూపర్‌బజార్(కొత్తగూడెం):** జిల్లా యువత చేతి వృత్తుల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగొచ్చని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. చేతి వృత్తులతో స్థిరత్వం, ఆదాయం ఉంటాయని, శిక్షణ పూర్తయ్యాక నెలకు రూ.15 వేల నుంచి రూ. 30 వేలకు వరకు పారితోషికం ఇచ్చే సంస్థలు చాలా ఉన్నాయని చెప్పారు. ఈ అవకాశాన్ని యువత వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్కిల్ అకాడమీ అసిస్టెంట్ మేనేజర్ సంతోష్ చారి, మెప్మా పీడీ రాజేష్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా కార్పెంటర్ల సంఘం అధ్యక్షుడు రామడుగు రామాచారి తదతరులు పాల్గొన్నారు.

# మందులు అందుబాటులో ఉంచాలి

**ఐటీడీఏ పీఓ రాహుల్**

**భద్రాచలం:** వర్షాకాలం సీజన్‌లో ప్రబలే వైరల్ జ్వరాల నివారణకు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. లేబోరేటరీ, ఆపరేషన్ థియేటర్, అల్ట్రా సౌండ్ స్కానింగ్ గదితో పాటు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతాల నుంచి ఎక్కువగా గిరిజనులు ఆస్పత్రికి వస్తుంటారని, డాక్టర్లు, సిబ్బంది వారికి అందుబాటులో ఉండాలని అన్నారు. వైరల్ జ్వరాలను ముందుగానే గుర్తించి ప్రమాద తీవ్రత తగ్గించాలని చెప్పారు. గర్భిణుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, గ్రామాల నుంచే అంబులెన్స్‌ల్లో ఆస్పత్రికి తీసుకొచ్చి, సుఖ ప్రసవం తర్వాత తిరిగి ఇంటికి పంపించే బాధ్యత వైద్యులదేనని అన్నారు. వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్లి వైద్య సేవలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు గిరిజన మహిళా ఆరోగ్య కార్యకర్తల శిక్షణా కేంద్రాన్ని సందర్శించి, శిక్షణ పొందుతున్న మహిళలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏడీఎంహెచ్ఓ సైదులు, ఏటీడీఓ అశోక్ కుమార్, గిరిజన సంక్షేమ ఈఈ హరీష్, డిప్యూటీ డీఎంహెచ్ఓ చైతన్య, ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పనులు చకచకా..

- సిద్ధమవుతున్న 100 పడకల ఆస్పత్రి
- రూ.37.50 కోట్లు.. మూడు అంతస్తుల్లో నిర్మాణం
- పూర్తయితే ప్రజల ముంగిట్లోకి ఉన్నత వైద్యం
- ఖమ్మం, కొత్తగూడెం వెళ్లకుండానే మెరుగైన చికిత్స

**ఇల్లెందు:** ఇల్లెందులో 100 పకడల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఆస్పత్రి నిర్మాణానికి మార్చి 16న శంకుస్థాపన చేయగా.. తెలంగాణ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీజీఎంఎస్ఐడీసీ)ద్వారా వైద్య విధాన పరిషత్ నిధులు రూ. 37.50 కోట్లతో పనులు చేపట్టారు. స్థల సేకరణలో జాప్యంతో మొదట్లో కొంత ఆలస్యమైనా.. ప్రస్తుతం పనుల్లో వేగం పుంజుకుంది. ఈ ఆస్పత్రిలో ఇప్పటికే రోజూ 800 తగ్గకుండా ఓపీ, 100 మంది ఇన్ పేషెంట్లు ఉంటున్నారు.

**నాడు 14 పడకలతో..**

ఇల్లెందులో ప్రభుత్వ ఆస్పత్రి పాత భవనాన్ని 1976 జూన్ 6న నాటి సీఎం జలగం వెంగళరావు 14 పడకలతో ప్రారంభించారు. 2009 ఫిబ్రవరి 7న అప్పటి వైద్యారోగ్యశాఖ మంత్రి సంభాని చంద్రశేఖర్ 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడమే కాక, రూ.1.02 కోట్లతో నిర్మించిన కొత్త భవనాన్ని ప్రారంభించారు. ఇక తెలంగాణ ఆవిర్భావం తర్వాత వైద్య రంగం అభివృద్ధి చెందింది. 2022 జనవరి 4న ఈ 30 పడకల ఆస్పత్రి(సీహెచ్‌సీ)ని వైద్య విధాన పరిషత్‌కు బదలాయించారు. ఆ తర్వాత వైద్యులు, సిబ్బంది సంఖ్య పెరగడంతో పాటు పేషెంట్ల రాక కూడా గణనీయంగా పెరిగింది. దీంతో ప్రభుత్వం 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ 2023 ఆగస్టు 3న రూ. 37.50 కోట్లతో నూతన భవనం మంజూరు చేసింది. అయితే నిధులు విడుదలలో జాప్యం, స్థలం అందుబాటులో లేకపోవడంతో గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభం కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే కోరం కనకయ్య.. సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లి నిధులు విడుదల చేయించారు. సింగరేణికి చెందిన ఐదెకరాల స్థలం కేటాయించడంతో పనులు ప్రారంభమయ్యాయి.

**మారనున్న రూపురేఖలు..**

ఇల్లెందు ఆస్పత్రిని వైద్య విధాన పరిషత్‌లోకి బదలాయించాక వైద్యులు, సిబ్బంది సంఖ్య పెరిగింది. ప్రస్తుతం 12 మంది వైద్యులు సేవలందిస్తున్నారు. 100 పడకల ఆస్పత్రిగా మారితే 30 మంది వైద్యులు, 60 మంది నర్సులతో పాటు 40 మంది ఇతర సిబ్బంది పనిచేసే అవకాశం ఉంటుంది. భవన నిర్మాణం పూర్తయితే ఆస్పత్రి రూపురేఖలు మారుతాయి. స్పెషలిస్టు వైద్యులు, సిబ్బంది నియామకంతో మారుమూల ప్రాంత ప్రజలకు ఉన్నత వైద్యం చేరువ కానుంది. గైనిక్, ఫిజీషియన్, సర్జన్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, ఫిజియోథెరపీ, న్యూరో, డెంటల్, అనస్థీషియా, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, ఆప్తాలమీ తదితర సేవలు అందుబాటులోకి రానున్నాయి. గతంలో ఏ చికిత్స కోసమైనా ఖమ్మం లేదా కొత్తగూడెం వెళ్లాల్సి వచ్చేది.

**గ్రౌండ్ ఫ్లోర్.. మూడు బ్లాక్‌లు**

ఇల్లెందు 100 పడకల ఆస్పత్రిని గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు రెండు అంతస్తులు నిర్మిస్తున్నారు. ఎమర్జెన్సీ/ ట్రామా కేర్, బ్లడ్ బ్యాంక్, జనరల్ రిజిస్ట్రేషన్ ఫార్మసీ, మెడికల్ స్టోర్, డెలివరీ విభాగం, ఓపీ సెక్షన్లు ప్రధాన విభాగాలుగా ఉంటాయి. పోలీస్ ఔట్ పోస్టు, 9 పడకలతో ఎమర్జెన్సీ వార్డు, ఎక్స్ రే రూం, స్టెరిలైజేషన్ రూం, డ్యూటీ డాక్టర్, డ్యూటీ నర్సుల గదులతో పాటు ప్రతీ విభాగానికి ప్రత్యేకంగా గదులు నిర్మిస్తున్నారు. ఫస్ట్ ఫ్లోర్‌లో ఫిమేల్ వార్డు, ఓపీ సెక్షన్, అడ్మినిస్ట్రేషన్, రోగ నిర్ధారణ విభాగాలు ఉంటాయి. గైనకాలజీ వార్డులో 15, ఫిమేల్ మెడికల్ సర్జికల్ వార్డులో 15 పడకలు ఏర్పాటు చేస్తారు. సెకండ్ ఫ్లోర్‌లో 15 పడకలతో కూడిన మూడు వార్డులు, ఆయుష్ క్లినిక్, కంటి వైద్యం, చర్మవ్యాధుల నిపుణులు, చిన్న పిల్లల విభాగం, ఏడు బెడ్లతో ఐసీయూ, ఐసోలేషన్ తదితర విభాగాలు ఉంటాయి.



ఇల్లెందు 100 పడకల ఏరియా ఆస్పత్రి నమూనా

**పనుల వేగం పెరిగింది..**

శంకుస్థాపన చేసి, స్థలం అప్పగించాక పనుల్లో వేగం పెరిగింది. ఏ ఆటంకం లేకుండా సాగితే రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేస్తాం. ఇప్పటికే సుమారు 20 శాతం పనులు పూర్తయ్యాయి.

– సీహెచ్ వికాస్, ఏఈ, టీజీఎంఎస్ఐడీసీ

**పేదలకు మేలు**



ఇల్లెందులో అత్యవసర వైద్యం అందుబాటులో లేదు. ఏ జబ్బు వచ్చినా ఖమ్మం రిఫర్ చేస్తున్నారు. పేదలు అంత దూరం వెళ్లి చికిత్స చేయించుకోవడం కష్టం. 100 పడకల ఆస్పత్రి పూర్తయితే పేదలకు మేలు జరుగుతుంది.

– కంది సదానందం, నెంబర్–2 బస్తీ, ఇల్లెందు

**అందుబాటులోకి ఉన్నత వైద్యం..**



100 పడకల ఆస్పత్రి పూర్తయితే ఇల్లెందు ముంగిటకు ఉన్నత వైద్యం చేరువవుతుంది. 30 మంది డాక్టర్లు, ఇతర సిబ్బంది నియామకంతో పాటు మందులు, ఇతర పరికరాలు అందుబాటులోకి వస్తాయి.

– జి.రవిబాబు, డీసీహెచ్ఎస్

**వేగంగా పనులు సాగేలా..**



100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి సింగరేణి స్థలం సేకరించి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో శంకుస్థాపన చేయించాం. నిర్మాణ పనులు కూడా వేగంగా సాగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆస్పత్రి అందుబాటులోకి వస్తే ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగం.

– కోరం కనకయ్య, ఎమ్మెల్యే, ఇల్లెందు

## క్లుప్తంగా

### జడ్జిల అసోసియేషన్ ఈసీ సభ్యుడిగా శివనాయక్


న్యాయమూర్తి శివనాయక్

**భద్రాచలంఅర్బన్:** తెలంగాణ న్యాయమూర్తుల అసోసియేషన్ ఈసీ సభ్యుడిగా భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తి శివనాయక్ ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని సిటీ సివిల్ కోర్టులో 2025 – 26 ఏడాదికి నిర్వహించిన ఎన్నికల్లో ఈసీ సభ్యుడిగా శివనాయక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నిక పట్ల భద్రాచలం బార్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

### వసతిగృహ నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపనలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

**దుమ్ముగూడెం:** మండలంలోని నర్సాపురం జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ధాత్రి ఆబా జన్‌జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్మించే వసతిగృహానికి మంగళవారం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేశారు. నర్సాపురం ఉన్నత పాఠశాల పరిధిలో రూ.3.5 కోట్ల వ్య యంతో వసతిగృహం మంజూరైంది. ఈ సందర్భంగా హెచ్‌ఎం బెక్కంటి శ్రీనివాసరావు మా ట్లాడారు. గిరిజనప్రాంతంలో ఈ వసతిగృహం ఏర్పాటుతో విద్యార్థులకు పౌష్టికాహారంతోపాటు మంచి విద్య అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో పూజారి రత్నకుమారి, నాగేశ్వరచారి, దుర్గాశ్రీనివాస్, సురేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### వీ-హబ్ ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌జీలకు అవగాహన


మాట్లాడుతున్న అధికారులు

**చుంచుపల్లి:** వీ-హబ్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎస్‌హెచ్‌జీల్లోని మహిళా పారిశ్రామికవేత్తలకు ర్యాంప్ ఉమెన్ ఆక్సెలెరేషన్ ప్రోగ్రాంపై మంగళవారం కొత్తగూడెంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ విద్యాచందన, వీ-హబ్ డైరెక్టర్ జాహిద్ షేక్ మాట్లాడారు. వరల్డ్ బ్యాంక్, కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్‌ఎంఈ నిధులతో చేపడుతున్న ఈ ప్రోగ్రాం ద్వారా మహిళల ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యాపారాలకు మద్దతు లభిస్తుందన్నారు. రెండేళ్లపాటు కొనసాగనున్న ఈ ప్రోగ్రాంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికై న మహిళా పారిశ్రామికవేత్తలకు తమ బిజినెస్ అభివృద్ధిని వేగవంతం చేసుకునే అవకాశం కల్పిస్తారని చెప్పారు. కార్యక్రమంలో వీ-హబ్ అసోసియేట్ డైరెక్టర్ ఊహ, డీపీఎం అనురాధ, వీ-హబ్ సభ్యులు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టాలి


**ఐటీడీఏ అదనపు వైద్యాధికారి సైదులు**

**భద్రాచలంటౌన్:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆదివాసీ గిరిజన గ్రామాల్లో డెంగీ, టైఫాయిడ్, మలేరియా వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ అదనపు వైద్యాధికారి సైదులు అన్నారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో మలేరియా నోడల్ పర్సన్స్, సబ్ యూనిట్ ఆఫీసర్స్, టెక్నికల్ సూపర్‌వైజర్లతో ఆయన మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వర్షాకాలం సీజన్ అయిపోయే వరకు మలేరియా అధికారులు, సిబ్బంది గ్రామాల్లో విస్తృతంగా పర్యటించాలని సూచించారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్‌లను కట్టడి చేసి మరణాలు జరగకుండా చూడాలని తెలిపారు. ప్రతి నెల 7వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ప్రతి గ్రామంలో రాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించి దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రతపైఅవగాహన కల్పించాలన్నారు. ఆశా కార్యకర్తలు, మలేరియా సిబ్బంది కలిసి మంగళవారం, శుక్రవారం తప్పనిసరిగా డ్రైడే పాటించాలని చెప్పారు. మలేరియా కేసులు నమోదైతే ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహించాలని చెప్పారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చైతన్య, మలేరియా, ప్రోగ్రాం అధికారులు స్పందన, పుల్లారెడ్డి, ఇమ్మానియేల్, లింగానాయక్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### రేపు స్పాట్ అడ్మిషన్లు

**పాల్వంచరూరల్:** మండలంలోని లక్ష్మీదేవిపల్లి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ఈ నెల 31న ఉదయం 9 గంటల నుంచి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ అన్వేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో 70శాతం మార్కులు సాధించిన విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు అర్హులని పేర్కొన్నారు. పదోతరగతి ఉత్తీర్ణత మెమో, ఆదాయ, కుల, పుట్టినతేదీ ధ్రువపత్రాలు, టీసీ వెంట తీసుకుని స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని, పూర్తివివరాలకు 97045 50206 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### పామాయిల్ గెలలు



| | |
|---|---|
| టన్ను ధర | రూ.17,463 |

# డబ్బులు ఊరికే పోగొట్టుకోవద్దు..

- సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కొద్దు..
- ఏడు నెలల్లో 103 కేసులు నమోదు..
- సుమారు రూ.5.60 కోట్లు కోల్పోయిన బాధితులు
- అప్రమత్తంగా ఉండాలని సైబర్ పోలీసుల సూచన



**కొత్తగూడెంటౌన్:** ప్రస్తుతం సైబర్ నేరగాళ్ల ట్రాప్‌లో పడి చాలామంది మోసపోతున్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లను ఓపెన్ చేస్తే ఇక అంతే సంగతులు. డబ్బులకు ఆశ పడితే గోసపడటం ఖాయమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే, ఈ సైబర్ నేరాలకు గురయ్యేది ఎక్కువగా విద్యావంతులే ఉండటం విస్మయానికి గురిచేస్తోంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ డబ్బు వస్తుందనే ఆశతో ముందుకెళ్తే ఉన్నదంతా ఊడ్చుకుపోతున్నారని పలువురు వాపోతున్నారు. సాంకేతికతను ఉపయోగించి ప్రజల నుంచి సైబర్ ముఠాలు నగదు దోచుకుంటున్నాయి. రకరకాల ఎత్తుగడలు వేసి, సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు పంపి, బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు కొల్లగొడుతున్నారు.

**మోసపోయారిలా..**

ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు కొత్త పంథాను అనుసరిస్తున్నారు. డిజిటల్ అరెస్టుల పేరుతో డబ్బులు గుంజుతున్నారు. జిల్లాకు చెందిన ఓ వ్యక్తికి సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు పేరుతో ఫోన్ చేసి, రూ.40 లక్షలు కాజేశారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. స్టాక్ మా ర్కెట్‌లో లాభాలు వస్తాయని చెప్పడంతో జిల్లాకు చెందిన ఓ ఉద్యోగి పెట్టుబడి నగదు పోగొట్టుకున్నా డు. అది ఫేక్ అని తెలిసి పోలీసులకు ఫిర్యాదు చేశా డు. ఓ నిరుద్యోగికి సైతం ఆన్‌లైన్‌లో ఉద్యోగం ఉందని.. నెలకు రూ.25 వేల వేతనం అని ఆశ చూపా రు. దీంతో సదరు నిరుద్యోగి (మహిళ) మూడు విడతలుగా రూ.2 లక్షలు చెల్లించింది. ఆ తర్వాత సదరు ఫోన్ నంబర్ పనిచేయకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి సైబర్ పోలీసులను ఆశ్రయించింది.

**103 నేరాలు..**

జిల్లాలో ఏడు నెలల వ్యవధిలో 103 సైబర్ నేరాలు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. బాధితులంతా సుమారు రూ.5,64,00,000ను సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి పోగొట్టుకున్నారు. బాధితుల ఫిర్యాదుతో ఆయా ఖాతాల్లో దాదాపు రూ.77,51,000ల నగదును అధికారులు ఫ్రీజ్ చేశారు. రూ.60,67,000 నగదును బాధితులకు తిరిగి అందించారు. డబ్బులు ఇతరులకు ట్రాన్స్‌ఫర్ చేసే ముందు జాగ్రత్తలు పాటించాలని, సైబర్ నేరగాళ్లకు బలికావొద్దని పోలీసులు సూచిస్తున్నారు.

**సమాచారం అందించాలి..**

ఎవరైనా సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోతే 24 గంటలలోపు (గోల్డెన్ హవర్) 1930 నంబర్‌కు గానీ, డయల్–100కు కానీ సమాచారం అందించాలి. సైబర్ మోసానికి సంబంధించిన పూర్తి విషయాలను పోలీసులకు తెలిపాలి. అప్పుడు మోసగాళ్ల బ్యాంకు ఖాతాలను నిలిపివేసి, పోగొట్టుకున్న సొమ్మును తిరిగి రాబట్టుకునే అవకాశం ఉంటుంది. అలాగే, ఆన్‌లైన్ జాబ్‌లు, బెట్టింగ్‌లు, ట్రేడింగ్ అంటూ వచ్చే లింక్‌లు, ఏపీకే యాప్ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ పోలీసులు పేర్కొంటున్నారు. ఏపీకే ఫైళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయొద్దని, పలు ఆకర్షణీయమైన ప్రకటనలతో నగదు ట్రాన్స్‌ఫర్ చేయొద్దని చెబుతున్నారు.

**అప్రమత్తత అవసరం**



తప్పుడు మెసేజ్‌లు, లింకులకు స్పందించవద్దు. అనుమానాస్పద వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు చెప్పకూడదు. ఎవరూ వ్యక్తిగత వివరాలు, బ్యాంకు, ఆధార్‌కార్డులు, ఓటీపీ, వివరాలు అడగరు. బ్యాంకు ఖాతా, ఏటీఎంల సమాచారం ఎవరితోనూ పంచుకోవద్దు. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి. సైబర్ మోసాల బారిన పడితే తక్షణమే 1930.. లేదా డయల్–100కు ఫోన్ చేయాలి.

–రోహిత్‌రాజు, ఎస్పీ, భద్రాద్రి కొత్తగూడెం

# ఆదివాసీ దినోత్సవానికి ఏర్పాట్లు


విగ్రహాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ అధికారులు, గిరిజన సంఘాల నాయకులు

**భద్రాచలంటౌన్:** పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లోని ఆదివాసీ మహనీయుల విగ్రహాలను పరిశీలించి, ఆగస్టు 9వ తేదీన జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరం చేయాలని ఆదివాసీ కమిటీ సభ్యులకు సూచించామని ఐటీడీఏ ఏపీఓ డేవిడ్‌రాజ్ తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం కార్యక్రమానికి నియమించిన గిరిజన ఆదివాసీ ఐక్య కార్య చరణ కమిటీ సభ్యులు, ఐటీడీఏ అధికారులు పట్టణంలోని అల్లూరి సీతారామరాజు, మల్లు దొర, గంటల దొర, అంబేడ్కర్, కొమరం భీమ్, రాణి దుర్గాదేవి విగ్రహాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ సంఘాల అభ్యర్థన మేరకు మహనీయుల విగ్రహాలకు పెయింటింగ్‌తో పాటు ప్లాట్‌ఫామ్స్ నిర్మాణం చేస్తామని, కూరగాయల మార్కెట్ దగ్గర ఉన్న అమరవీరుడు కొమరం భీమ్ విగ్రహానికి రూ.1.55 లక్షలు, అంబేడ్కర్ సెంటర్ వద్ద ఉన్న మహనీయుల విగ్రహాలకు రూ.2.30 లక్షల వ్యయంతో మరమ్మతులు జరుగుతున్నాయని ఆయన వివరించారు. కార్యక్రమంలో పూణెం కృష్ణదొర, ఆదివాసీ సమితి అధ్యక్షుడు ముర్ల రమేశ్, కొండారెడ్డి, పాయం రవివర్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# డీసీఓ, పీఏసీఎస్ చైర్మన్‌కు కోర్టు ధిక్కరణ వారెంట్లు

**అశ్వాపురం:** జిల్లా సహకార అధికారి, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడికి కోర్టు ధిక్కరణ కింద హైకోర్టు ఈ నెల 25న బెయిలబుల్ వారెంట్లు జారీచేసింది. మండల పరిధిలోని నెల్లిపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అవకతవకలు జరిగాయని గతంలో అప్పటి సీఈఓ రామారావు, ఉద్యోగి గూడురు శ్రీనివాసరెడ్డిని సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్షన్‌పై రామారావు, శ్రీనివాసరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. డీసీఓ, నెల్లిపాక పీఏసీఎస్ చైర్మన్‌ను ప్రతివాదులుగా చేరుస్తూ తమకు ఉద్యోగం ఇవ్వాలని, సస్పెన్షన్ కాలంలో వేతనం చెల్లించాలని పిటిషన్‌లో కోరారు. దీంతో హైకోర్టు సస్పెన్షన్ కాలంలో వేతనం చెల్లించాలని ఉత్తర్వులు ఇచ్చింది.కోర్టుఆదేశాలు అమలుకాకపోవడంతో వారు మళ్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఈ నెల 25న డీసీఓకు, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడికి కోర్టు ధిక్కరణ కింద హైకోర్టు బెయిలబుల్ వారెంట్లు జారీచేసింది.

# ఘనంగా పులుల దినోత్సవం


పాపకొల్లు అటవీ ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు

**జూలూరుపాడు:** అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని మంగళవారం జూలూరుపాడు ఎఫ్ఆర్‌ఓ జి.ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ జంతువుల కోసం వేటగాళ్లు ఉచ్చులు పెట్టే ప్రాంతాల్లో ఎఫ్ఆర్‌ఓ, అటవీ సిబ్బంది కలిసి ప్రత్యేక గస్తీ నిర్వహించారు. గుండ్లరేవు గ్రామ పంచాయతీ ఎలుకలొడ్డు గ్రామ సమీపంలో గొత్తికోయ గుంపులో అటవీ అధికారులు తనిఖీ చేశారు. అనంతరం జూలూరుపాడు హైస్కూల్‌లో అడవులు, వన్య ప్రాణుల సంరక్షణ, పులులు అంతరించిపోతే అనర్థాలు, పులుల సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలపై కల్పించారు. కార్యక్రమంలో అటవీ సెక్షన్ ఆఫీసర్లు హనుమంతు, మల్లయ్య, హారిక, డీఆర్‌ఓ నాసూర్‌బీ, ఎఫ్‌బీఓలు రేఖ, శ్రీలత, విజయలక్ష్మి, బి.నరసింహారావు, రహీం, చింతా వెంకటేశ్వర్లు, శ్రావణ్, కిషన్, హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పెండింగ్ పనులు పూర్తిచేయాలి


మాట్లాడుతున్న ట్రైయినీ కలెక్టర్ సౌరభ్‌శర్మ

**కొత్తగూడెంఅర్బన్:** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ పనులను వెంటనే పూర్తి చేయాలని ట్రెయినీ కలెక్టర్ సౌరభ్‌శర్మ తెలిపారు. కొత్తగూడెంలోని ఆనందఖని పాఠశాలలో విద్యాధికారులు, టీజీడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న సివిల్ పనులను వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలలో ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. మండలంలో ఉన్న జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలను కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ల ద్వారా వెంటనే ఇంటింటి సర్వే నిర్వహించి, వాటిని తెరిచేవిధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మండల విద్యాధికారులు వారి పరిధిలో పాఠశాలలను సందర్శించి, నివేదికలు సిద్ధం చేయాలని, ప్రతి నెల సమీక్షలో అవి అందించాలని పేర్కొన్నారు. సమావేశంలో డీఈఓ వెంకటేశ్వరచారి, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు నాగరాజశేఖర్, ఎస్కే సైదులు, ఎస్.సతీశ్‌కుమార్, జె.అన్నామణి, నాగేశ్వరాచారి పాల్గొన్నారు.

# పీఏసీఎస్‌ను సందర్శించిన డీసీసీబీ సీఈఓ


లావాదేవీల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

**మణుగూరురూరల్:** మండలంలోని మణుగూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాన్ని డీసీసీబీ సీఈఓ వెంకట్ ఆదిత్య, అసిస్టెంట్ జీఎం ప్రవీణ్ మంగళవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. లావాదేవీలు, చేపడుతున్న విధివిధానాలను సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, సంఘం సీఈఓ జ్ఞానదాసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఈఓ వెంకట్‌ఆదిత్య మాట్లాడుతూ.. డీసీసీబీ, సహకార సంఘం సేవ లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంఘంద్వారా అందించే కొత్తరుణాలు, దీర్ఘకాలిక రుణాలు, గేదెలు, ఇళ్ల రుణాలపై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను రైతులు వినియోగించుకుని లబ్ధిపొందాలని సూ చించారు. కార్యక్రమంలో మణుగూరు డీసీసీబీ మేనేజర్ బాలరాజు, సొసైటీ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# నానో యూరియాపై అవగాహన


నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

**గుండాల:** పంట మార్పిడి లేకుండా ఏటా ఒకే రకమైన పంట పండిస్తూ అధికంగా యూరియా చల్లితే భూసారం దెబ్బతింటుందని, అధిక దిగుబడి పొందాలంటే సహజ ఎరువులతో పాటు నానో యూరియాను వేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, ఆత్మ డీపీడీ సరిత అన్నారు. మండలంలోని ముత్తాపురం గ్రామంలో మంగళవారం నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించారు. యూరియా వాడకంతో నీరు, గాలి గాలుష్యం ఏర్పడుతుందని, వ్యాధులు సంక్రమిస్తాయని, దిగుబడి తగ్గుతుందన్నారు. ఈ ప్రాంతంలో అవగాహన లేక ఎకరానికి ఎక్కువ మోతాదులో యూరియాను చల్లుతున్నారని తెలిపారు. ప్రస్తుతం అన్ని చోట్ల నానో యూరియా అందుబాటులో ఉందని, ఒక బస్తా యూరియాతో పాటు, ఎకరానికి 500 మి.లీలు పిచికారీ చేస్తే సరిపోతుందని చెప్పారు. ఇప్పటికే మట్టి పరీక్షలు చేశారని, పంట మార్పిడి లేకుండా సాగు చేయడం, అధిక మోతాదులో రసాయనిక ఎరువులు చల్లడంతో భూసారం దెబ్బ తిన్నదని, రానున్న కాలంలో భూమిలో పోషకాలు లేకుండా పోతాయని తెలిపారు. నేలను కాపాడుకుంటేనే అన్ని రకాల పంటలు సాగు చేసుకోవచ్చునని వివరించారు. అనంతరం డ్రోన్‌తో నానో యూరియా పిచికారీ చేయడంపై అవగాహన కల్పించారు. కలుపుమందుతో కలిపి నానో యూరియా పిచికారీ చేయొద్దని సూచించారు. అనంతరం పీఏసీఎస్‌ను సందర్శించి యూరియా ఎంత ఉందని తెలుసుకున్నారు. పీఏసీఎస్ చైర్మన్ గొగ్గెల రామయ్య, ఏఓ వెంకటరమణ, ఏఈఓలు లెనిన్, బాలరాజు, వ్యాపారస్తులు మానాల వెంకటేశ్వర్లు, మానాల ప్రభాకర్, తిరుక్కోవళ్లూరి వెంకటేశ్వర్లు, ప్రణీత్, రైతులు పాల్గొన్నారు.

### అశ్వారావుపేట, మణుగూరు ఆస్పత్రుల్లో రక్త నిల్వ కేంద్రాలు

**అశ్వారావుపేట:** స్థానిక ఏరియా ఆస్పత్రికి రక్త నిల్వ కేంద్రం మంజూరైనట్లు ఆస్పత్రి వైద్యుడు విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023లో మంజూరైన ఈ కేంద్రం సాంకేతిక కారణాలతో ప్రారంభానికి నోచుకోలేదని.. స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, డీసీహెచ్‌ఎస్ రవిబాబు విజ్ఞప్తి మేరకు కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ కృషితో మంగళవారం కేంద్రం మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ అయినట్లు ఆయన వెల్లడించారు. కాగా, మణుగూరు ఆస్పత్రికి సైతం రక్త నిల్వ కేంద్రం మంజూరైనట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# లయన్స్‌క్లబ్ సభ్యుల ఆర్థిక సాయం


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

**మణుగూరురూరల్:** మండలంలోని సంతోష్‌నగర్‌లో గల శ్రీవిద్యాభ్యాస (బాలవెలుగు) పాఠశాల విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ కముజు చంద్రమోహన్ మనువళ్లు ఇషాన్, శివాన్స్‌లు అమెరికా నుంచి ఇండియాకు వచ్చిన సందర్భంగా మంగళవారం సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. తొలుత కేక్ కట్ చేసి విద్యార్థులకు మిఠాయిలు, బిస్కెట్లను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల నిర్వాహకుడు బి.జగన్మోహన్ రెడ్డి అభ్యర్థన మేరకు 80 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్ కోసం కముజు చంద్రమోహన్ రూ.10 వేలు, దివంగత ఈఆర్‌కే ప్రసాద్‌రెడ్డి కుమారుడు ఆదిరెడ్డి రూ.15 వేలు, డాక్టర్ దుస్సా సమ్మయ్య రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ముత్తంశెట్టి నాగేశ్వరరావు, డాక్టర్ దుస్సా సమ్మయ్య, చింతపల్లి రాంబాబు, యాదగిరి, ఉపాధ్యాయులు దేవి, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధురాలు ఆత్మహత్య

**కరకగూడెం:** గడ్డిమందు తాగి ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ పీవీఎన్ రావు కథనం ప్రకారం.. మండలంలోని అశ్వాపురంపాడుకు చెందిన కోవాసి నందమ్మ (65) అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. జీవితంపై విరక్తి చెంది రెండు రోజుల కిందట గడ్డిమందు తాగింది. గమనించిన స్థానికులు 108 ద్వారా ఆమెను భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మంగళవారం రాత్రి నందమ్మ మృతి చెందింది. మృతురాలి కుమారుడు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో మృతదేహాన్ని కుటుంబ సభ్యులు 2 కిలోమీటర్ల వరకు జెట్టి కట్టుకొని గ్రామంలోకి తీసుకెళ్లాల్సి వచ్చింది.

### రేషన్ బియ్యం పట్టివేత


పోలీసులు పట్టుకున్న ట్రాలీ ఆటో

**అశ్వాపురం:** భద్రాచలం నుంచి మణుగూరుకు ట్రాలీ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న ఏడున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. వాహనాల తనిఖీ చేస్తుండగా పోలీసులు ట్రాలీలో తరలిస్తున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి, రేషన్ షాపులో అప్పగించారు.

### ద్విచక్రవాహనం చోరీ

**దుమ్ముగూడెం:** మండలంలోని నర్సాపురం గ్రామవాసి కనుకు పృథ్వీకి చెందిన ద్విచక్రవాహనం మంగళవారం చోరీకి గురైంది. పృథ్వీ ద్విచక్రవాహనంపై పొలం వద్దకు వెళ్లాడు. బైక్‌ను పొలం గట్టుపై నిలిపి పొలంలోకి వెళ్లాడు. పనులు చూసుకుని వచ్చే సరికి బైక్ కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### సాయం కోరుతూ సెల్‌ఫోన్..


జేబులో సెల్‌ఫోన్‌ను చోరీ చేస్తున్న వ్యక్తి

**భద్రాచలంఅర్బన్:** ఓ వ్యక్తి జేబులో నుంచి సెల్‌ఫోన్‌ను చోరీ చేసిన ఘటన మంగళవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఓ కళ్లజోడు దుకాణం ఎదుట ఈ నెల 7న బైక్ పడి పోయింది. ఓ వ్యక్తి బైక్‌ను లేపాలని అరవడంతో కళ్లజోడు దుకాణం యజమాని షుకూర్ వచ్చి పడిపోయిన ద్విచక్రవాహనాన్ని లేపాడు. ఈ సమయంలో పక్కనే ఉన్న మరో వ్యక్తి కూడా వచ్చి సాయం చేశాడు. తర్వాత షుకూరు తన జేబులో ఉన్న సెల్‌ఫోన్ కనిపించకపోవడంతో దుకాణంలో ఉన్న సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించగా.. బైక్‌ను పైకిలేపుతున్న సమయంలో ఓ వ్యక్తి తన జేబులో ఉన్న సెల్‌ఫోన్ కొట్టేసినట్లు కనిపించింది. కాగా, ఈ ఘటన మంగళవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

### విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

**చర్ల:** మండలంలోని కుర్నపల్లిలో సోమవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం కాగా.. రూ.లక్ష మేర ఆస్తి నష్టం సంభవించింది. కుర్నపల్లికి చెందిన ఉయిక మోతెయ్య కుటుంబ సభ్యులు సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా విద్యుత్ మీటర్ సమీపంలో మంటలు లేచి ఇంటికి అంటుకున్నాయి. వెంటనే వారంతా బయటకు రావడంతో ప్రమాదం తప్పింది. స్థానికులు వచ్చి ఇంట్లోని కొన్ని వస్తువులను బయటకు తీసుకొచ్చినప్పటికీ విలువైన వస్తువులు కాలిబూడిదయ్యాయి. మొత్తం రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

### నాటుసారా పట్టివేత

**టేకులపల్లి:** ద్విచక్రవాహనంపై తరలిస్తున్న నాలుగు లీటర్ల నాటుసారాను పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం మండలంలోని బోడురోడ్డులో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. రాజారాంతండాకు చెందిన జర్పుల శంకర్ ద్విచక్రవాహనంపై నాలుగు లీటర్ల నాటుసారా తరలిస్తుండగా పట్టుకున్నారు. నాటుసారా, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు డీటీఎఫ్ ఎస్‌ఐ గౌతమ్ తెలిపారు. తనిఖీల్లో రామకృష్ణగౌడ్, హబీబ్‌పాషా, సుమంత్, శ్రావణి, రమేశ్ పాల్గొన్నారు.

**ఇసుక ట్రాక్టర్..**

**పాల్వంచరూరల్:** కిన్నెరసాని వాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని నాగారంకాలనీ కిన్నెరసాని వాగు నుంచి ఇసుకను ఉల్వనూరు వైపు తరలిస్తున్న ట్రాక్టర్‌ను రాజాపురం వద్ద ఎస్‌ఐ.సురేశ్ పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌డ్రైవర్ దోమల విశ్వనాథంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

**9 పశువులు..**

**ఇల్లెందు:** గుండాల నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న 9 పశువులను పోలీసులు ఇల్లెందులో పట్టుకున్నారు. మంగళవారం గుండాలకు చెందిన నలుగురు పశువుల విక్రయదారులు ఓ వాహనంలో 9 పశువులను హైదరాబాద్‌కు తరలిస్తుండగా ఎస్‌ఐ హసీనా ఆధ్వర్యంలో పట్టికుని పాల్వంచలోని గోశాలకు తరలించారు.

### కేసు నమోదు

**భద్రాచలంఅర్బన్:** పట్టణంలోని రామాలయం పరిసర ప్రాంతంలో ఉన్న ఓ రూంలోని అల్యూమినియం వస్తువులను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటనకు సంబంధించి యజమాని కల్యాణ్ మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, చోరీకి గురైన వస్తువుల విలువ రూ.2 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.